క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కూసుమంచి/నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా నేడు(శనివారం) కూసుమంచి, నేలకొండపల్లి మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈలు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనేపథ్యాన కూసుమంచి మండలంలోని పెరికసింగారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెరికసింగారం, జక్కేపల్లి, గట్టుసింగారం, గోరీలపాడుతండా, మల్లేపల్లి తదితర గ్రామాలకు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు. అదేవిధంగా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, తిరుమలాపురం, బోదులబండ, అనంతనగర్, కోరట్లగూడెంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కె.రామారావు చెప్పారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని పల్లెగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పల్లెగూడెం, రెడ్డిపల్లి ఇండస్ట్రియల్ ఫీడర్, ఆరేకోడు ఫీడర్, గోళ్లపాడు అగ్రికల్చర్ ఫీడర్, సాయిగణేష్‌నగర్ సాయి ఆదిత్య టౌన్‌షిప్, జీకేనగర్, ఎంఎస్ఆర్ వెంచర్, అమ్మ ఫంక్షన్‌హాల్, ముత్తగూడెం అగ్రికల్చర్ ఫీడర్‌లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎస్. రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఖమ్మం నియోజకవర్గంలో..

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: నగరంలోని 33/11 కేవీ రామాలయం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-5 ఏఈ ఆపరేషన్స్ ప్రభాకర్‌రావు తెలిపారు. దీంతో కమాన్‌బజార్, కస్బాబజార్, వల్లాల వారి వీధి, షాదీఖానా, స్టేషన్ రోడ్డు, బొమ్మన సెంటర్, శాంతి లాడ్జ్, వినోద థియేటర్, ఓల్డ్ మున్సిపాలిటీ ఆఫీస్, ఖిలా, శుక్రవారపుపేట, బ్రాహ్మణ బజార్, రిక్కా బజార్, చర్చి కాంపౌండ్, రామకృష్ణానగర్, సుగ్గలవారి తోట, మేదరబజార్, అమ్మ భవాని టెంపుల్ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. అలాగే ఖమ్మం టౌన్-1 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ దానవాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు, విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని సెక్షన్ ఆపరేషన్స్ ఏఈ మౌలిక ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సారధినగర్, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, జూబ్లీస్కూల్ ఏరియా, జూబ్లీ క్లబ్ రోడ్డు, ఫిష్ హౌస్ లైన్, బైపాస్ రోడ్డు, వాటర్ వర్క్స్, గణేష్ నగర్, మేకల నారాయణ బోర్డు, కామంచికల్, దారేడు తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. అలాగే విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు వీవీ పాలెం, జీఆర్ఆర్ శ్రీనివాసం ఏరియా, కొత్త కలెక్టరేట్, వేపకుంట్ల, చింతగుర్తి ప్రాంతాలకు కరెంట్ ఉండదని, ఖమ్మం అర్బన్ విద్యుత్ శాఖ ఏఈ అశోక్ తెలిపారు. అంతేకాక పంగిడి విద్యుత్ సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ వల్ల ఆ సబ్‌స్టేషన్ పరిధిలోని పంగిడి, మంగ్యాతండా, కేవీ బంజర, మూలగూడెం, రఘునగర్, ఎన్‌వీ బంజర గ్రామాలకు, వ్యవసాయ మోటార్లకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు అంతరాయం ఉంటుందని ఏఈ పోలూరు సతీష్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈలు కోరారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

కూసుమంచి: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించనున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పలు గ్రామాల్లో మంత్రి పర్యటించి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుంటారని, మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	54	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	90		20
కాకర	56	చుక్కకూర	3
బీర	66		20
దొండ	16	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	110	గోంగూర	4
గోరుచిక్కుడు	60		20
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	26		20
ఆలుగడ్డ	34	కొత్తిమీర	1
చామగడ్డ	46		30
క్యారెట్	56	పుదీన	1
క్యాప్సికం	76		20

-ఖమ్మం వ్యవసాయం

అమ్మ లక్ష్యం నెరవేరేనా..?

గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని తీసుకురాగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలుగా పేరు మార్చింది. ఇందులో భాగంగా జూన్ 12 నాటికి బడులు పునఃప్రారంభం కానుండగా.. ఈ లోగా భవనాలకు మరమ్మతులు, విద్యుత్, టాయిలెట్లు, తాగునీటి వసతులు కల్పించాలని నిధులు విడుదల చేసింది. దీంతో గడువులోగా పనులు పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనేపథ్యాన పాలేరు నియోజకవర్గంలో 148 పాఠశాలలను ఎంపిక చేసి సుమారు రూ.3 కోట్లు మంజూరు చేసింది. అయినా కానీ పనులు నత్తనడకన సాగుతున్నాయి.



సుర్దేపల్లి పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లో తుది మెరుగులపై కసరత్తు

- 148 పాఠశాలలకు సుమారు రూ.3 కోట్లు మంజూరు
- నత్తనడకన సాగుతున్న మరమ్మతులు
- పనులు చేయించేందుకు ఆసక్తి చూపని కమిటీ ప్రతినిధులు
- ఎన్నికల సమయాన కొన్ని పనులు పూర్తి
- బడులు ప్రారంభమయ్యే నాటికైనా పూర్తయ్యేనా?

నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసిన 148 పాఠశాలల్లో తొలి ప్రాధాన్యతగా తాగునీరు, టాయిలెట్ల రిపేర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించడం కోసం విధులు, నిధులు విడుదల చేసింది. కాగా, పనులు చేయాల్సిన పాఠశాలలను మార్చిలోనే గుర్తించగా.. అమ్మ ఆదర్శ కమిటీల మహిళా సంఘాలతో వీటిని చేయించాల్సి ఉంది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంతో ఇప్పటికే చాలా వరకు పనులు ప్రారంభించారు. కానీ పలు చోట్ల ఇంకా పనులు ప్రారంభించనే లేదు. ఎన్నికల పుణ్యమా అని కొన్ని చోట్ల పోలింగ్ కేంద్రాలుగా ఉండడంతో ఒత్తిడి చేసి పనులు పూర్తి చేయించారు.

148 పాఠశాలలకు రూ.3 కోట్లు..

పాలేరు నియోజకవర్గంలో మొత్తం 148 పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపిక చేసింది. అంతేకాక ఆయా పాఠశాలలలో చేపట్టాల్సిన పనులకు తగ్గట్టుగా నిధులు కూడా కేటాయించింది. డివిజన్ వ్యాప్తంగా దాదాపు రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేసింది. అయినా పనుల్లో వేగం పెంచకపోవడంతో బడులు ప్రారంభమయ్యే నాటికైనా పూర్తవుతాయో లేదో వేచిచూడాల్సిందే.

ముందుకు రాని కమిటీ ప్రతినిధులు..

పనులు పూర్తి చేయడానికి ముందుగా నగదు వెచ్చించి తరువాత బిల్లులు పెట్టుకోవాల్సి ఉంది. దీంతో పాలేరు నియోజకవర్గంలో అమ్మ ఆదర్శ కమిటీలో ఉన్న మహిళ సంఘాల ప్రతినిధులు చాలా వరకు ముందుకు రావడం లేదు. దీంతో రికార్డుపరంగా మహిళా సంఘాల పేరుతో ఉండేలా చూసి ప్రైవేట్ వ్యక్తులకు పనులను అప్పగిస్తున్నారు. నిర్దేశిత గడువు తరుముకొస్తుండడంతో ఒత్తిడి పెరిగి ఇలా చేయక తప్పడం లేదని పలువురు అధికారులు చెబుతున్నారు.

పనుల్లో వేగం పెంచాం..



మండలంలోని అమ్మ ఆదర్శ బడుల్లో చేపడుతున్న పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. బడులు ప్రారంభం నాటికి పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాం. ఈ పనులు పూర్తయితే విద్యార్థులకు అన్ని రకాల వసతులు సమకూరుతాయి.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ

చర్యలు తీసుకోవాలి..



అమ్మ ఆదర్శ బడుల్లో చేపట్టిన పనులు, ఎక్కడైనా పనులు ప్రారంభం కాకుంటే సంబంధిత అధికారులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. బడులు ప్రారంభమయ్యే నాటికి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలి. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలి.

– జి.మస్తాన్, విద్యార్థి సంఘం నాయకుడు

ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించాలి..



విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ బడులను బాగు చేసేందుకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలి. ప్రభుత్వం లక్ష్యాన్ని నూరుశాతం అమలయ్యేలా అధికారులు కృషి చేయాలి. పాఠశాలల ప్రారంభం నాటి కల్లా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– జి.రామారావు, సుర్దేపల్లి, సామాజిక కార్యకర్త

మండలాల వారీగా పాఠశాలల వివరాలు..

మండలం	ఎంపికైనవి	నిధులు(రూ.లక్షల్లో)	పూర్తయినవి	ప్రగతిలో ఉన్నవి
తిరుమలాయపాలెం	43	రూ.80	7	36
నేలకొండపల్లి	27	రూ.70	0	50 శాతం
ఖమ్మంరూరల్	33	రూ.70	0	50 శాతం
కూసుమంచి	45	రూ.70	20	25

దేవాలయం భూముల కౌలుపై వివాదం



మంగాపురంలో రైతులతో సమావేశమైన అసిస్టెంట్ కమిషనర్ సులోచన

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం భూములు కౌలుపై వివాదం చోటు చేసుకుంది. ఆలయం పేరిట మంగాపురం తండాలో 130 ఎకరాల భూమి ఉండగా, ప్రతీ ఏటా ఎకరానికి రూ.వెయ్యి చొప్పున కౌలుకు ఇస్తున్నారు. ఈసారి కౌలు పెంపు కోసం శుక్రవారం గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేయగా, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన పాల్గొని ఎకరానికి రూ.5 వేల వరకు చెల్లించాలని కోరారు. దీంతోరైతులు రూ.వెయ్యి కంటే పెంచేది లేదని తేల్చిచెప్పగా.. అధికారులు మాత్రం ప్రభుత్వ ఆదేశాల మేరకు పెంచాల్సిందేనని తెలిపారు. ఈవిషయం ఎటూ తేలకపోవడంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. ఆలయ ఈఓ కె.శ్రీకాంత్, చంద్రశేఖర్‌తో పాటు సంఘాల ప్రతినిధులు ప్రతినిధులు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, తేజావత్ బాలు, డి.నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, పాల్తీయ శ్రీనివాసరావు, డి.సుకో, ధనవాత్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేలం వాయిదా..

మండల కేంద్రంలోని శ్రీ భీమేశ్వరస్వామి దేవాలయం షాపుల బహిరంగ వేలం వాయిదా పడింది. శుక్రవారం నిర్వహించిన వేలానికి ఇద్దరే రావడంతో సమాచారం లేకుండా వేలం నిర్వహించడం సరికాదని స్థానికులు ఆరోపించారు. కాగా, గతంలో ఆలయ భూములపై రూ.3లక్షల మేర బకాయిలను వసూలు చేయాలని పలువురు కోరారు. ఈఓ శ్రీకాంత్, అర్చకులు తాటిపాముల లక్ష్మీనర్సింహాస్వామి, తుపురాణి మధుసూదనాచార్యులు, కొడవటిగంటి శివయ్య, దేవాదాయ శాఖ ఉద్యోగులతో పాటుపసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు

ఖమ్మంమయూరిసెంటర్: కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు హక్కుల సాధన కోసం పోరాడుతున్న ఐఎఫ్‌టీయూ ఖమ్మం ఏరియా మహాసభ ఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ములకలపల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌ల రూపంలో తెచ్చేందుకు ప్రయత్నించిందని, మరోసారి అధికారంలోకి వస్తుండడంతో కార్మికుల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్మిక చట్టాలను రక్షించుకునేందుకు, హక్కులను కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. అందుకు 16న రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే మహాసభలో సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు కె.శ్రీనివాస్, పెరబోయిన వెంకన్న, అమర్లపూడి అప్పారావు, బొమ్మకంటి రమేష్, జలగం రాంబాబు, జెట్టి గురవయ్య, రామ్మూర్తి, శోభన్, రజబల్లి వెంకన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య



అటెన్షన్ ప్లీజ్

నెలకే తారుమారు..!

ముచ్చర్ల-ఏన్కూర్ ఆర్అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు గురైంది. దీంతో నెల రోజుల క్రితమే ముచ్చర్ల క్రాస్ రోడ్డు నుంచి ముచ్చర్ల గ్రామం వరకు మరమ్మతులు చేపట్టారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ తూతూ మంత్రంగా తారువేసి చేతులు దులుపుకున్నాడు. దీంతో కనీసం నెల రోజులు కాకముందే రోడ్డు మళ్లీ ఇదిగో ఇలా దెబ్బతింది. అసలు రోడ్డు దెబ్బతిన్న ప్రాంతాల్లో రోడ్డును పూర్తిగా తొలగించకుండా వేయడంతో రోడ్డు దెబ్బతిందని అధికారుల తీరుపై ప్రయాణికులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– కామేపల్లి



సమాజ హితానికి లయన్స్ క్లబ్ సేవలు

ఖమ్మంగాంధీచౌక్:లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ సమాజహితం కోసం అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందని సంస్థ అధ్యక్షుడు కొత్త సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం నగరంలోని లయన్స్‌భవన్‌లో సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఏడాది కాలంగా సంస్థ నిర్వహించిన సామాజిక సేవా కార్యక్రమాలను తెలుపగా.. సంస్థ కోశాధికారి పెద్దపెల్లి సుధాకర్ ఆర్థిక నివేదికను వివరించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు కె.ఉపేందర్‌రెడ్డి, పి.ప్రభాకర్‌రెడ్డితో పాటు మెడికల్ ఎంట్రెన్స్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించిన ఎస్.గోఖుల కృష్ణారెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు డాక్టర్ ఎ.రాఘవరెడ్డి, డి.పూర్ణచందర్‌రావు, క్యాబినేట్ సభ్యులు పాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేతల నివాళి

కూసుమంచి: మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన సీపీఎం శాఖ సభ్యుడు కాకర్ల వీరబాబు అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం మృతదేహాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీకి వీరబాబు చేసిన సేవలను కొనియాడారు. ఆయనతో పాటు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుగ్గవీటి సరళ, జిల్లా కమిటీ సభ్యుడు బషీరుద్దీన్, మండల కార్యదర్శి ఎడవెల్లి రమణారెడ్డి, తోటకూరి రాజు, చీర్ల రాధాకృష్ణ తదితరులు నివాళులర్పించారు.

తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు కాంపాటి రమేష్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఆయన స్వగ్రామంలో రమేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ.. పార్టీ కోసం రమేష్ నిబద్ధతగా పనిచేశారని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు దొండేటి ఆనందరావు, దొడ్డ లింగస్వామి, సుధాకర్, కాంపాటి బాబూరావు, చల్లా వెంకటేశ్వర్లు, రామనబోయిన రవి, బింగి రమేష్, తుళ్లూరు నాగేశ్వరరావు, వెంకటేష్, వశపొంగు వీరన్న, దొండేటి నిర్మల్‌రావు పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయంలో క్రీడా శిక్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని పోలేపల్లిలో గల కేంద్రియ విద్యాలయంలో ఈ నెల 19 వరకు ఆటలకు సంబంధించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ కవీంద్రరాయ్ అన్నారు. ఈమేరకు శుక్రవారం కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆటల్లో 137 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

వినతుల వెల్లువ..

‘ప్రైవేటు’లో ఫీజులు నియంత్రించాలి..

ఖమ్మంమయూరిసెంటర్: కోచింగ్ సెంటర్లకు, ప్రైవేటు కళాశాలలకు కొమ్ముకాస్తున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖాధికారిపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ప్రైవేటు కళాశాలలు, కోచింగ్ సెంటర్లు వివిధ కోచింగ్‌ల పేరుతో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నా.. డీఐఈఓ పట్టించుకోవడంలేదని, వెంటనే వీటిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యాన శుక్రవారం కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. జిల్లాలో ‘ప్రైవేటు’ఆగడాలకు హద్దులేకుండా పోయిందని, ఎన్ని ఫిర్యాదులు చేసినా డీఐఈఓ పట్టించుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకుంటే సంఘం ఆధ్వర్యాన ఆందోళనలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కరుణ్, నరేందర్, పాషా తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

పెండింగ్ రెమ్యునరేషన్ చెల్లించాలి..

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల విధుల్లో పాల్గొన్న వారికి చెల్లించాల్సిన పెండింగ్ రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.మల్లయ్య, కె.వినోద్‌బాబులు అన్నారు. శుక్రవారం ఈ మేరకు నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని డీఐఈఓకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా ఆగిన రెమ్యునరేషన్‌ను వెంటనే ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సురేష్, కృష్ణార్జున్‌రావు, భాస్కర్, గోపాలకృష్ణ, ప్రసాదరావు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.



డీఐఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఫీజు రాయితీ కల్పించాలి..

ఖమ్మం సహకారనగర్: ప్రైవేటు పాఠశాలల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే-టీజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం డీఈఓ సోమశేఖరశర్మకు వారు వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన డీఈఓ సర్క్యులర్ జారీ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం జూనియర్ కళాశాలల్లో సైతం ఫీజు రాయితీ కల్పించాలని డీఐఈఓకు విన్నవించారు. నాయకులు జి.రమేష్‌బాబు, శెట్టి రజనీకాంత్, మందుల ఉపేందర్, భాస్కర్, చక్రవర్తి, షేక్ జానీపాషా, కొరకొప్పుల రాంబాబు, గోపి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందించాలి..

ఖమ్మంరూరల్: ఖరీఫ్ సీజన్‌లో దళిత, గిరిజన రైతులకు ఎరువులు, విత్తనాలు 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు శుక్రవారం రూరల్ తహసీల్దార్ బి.రాంప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తి సాధనలు, పరికరాలను గిరిజన, దళిత రైతులకు ఉచితంగా, మిగతా రైతులు సబ్సిడీతో ఇవ్వాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు మేరకు పంటలకు మద్దతు ధర కల్పించాలని, పంటల భీమా పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయాలని, ప్రభుత్వం ప్రకటించిన వరికి రూ. 500 బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రకృతి ప్రకోపంతో పంట నష్టపోయిన రైతులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని తక్షణమే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు బండెల వెంకయ్య, కుర్ర వెంకన్న, వై.ఉపేందర్, కె.పుల్లయ్య, కోటయ్య, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల సబ్‌స్టేషన్‌లో అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ డీఈ భద్రుపవర్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో విద్యుత్ వినియోగం పెరగనున్నందున దానికి అనుగుణంగా ముందస్తుగా సబ్‌స్టేషన్‌లో అదనపు 5 ఎంయూఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో గృహ, వ్యవసాయరంగ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డీఈ రామారావు, డీఈ వై.వీ.ఆనంద్‌కుమార్, ఏఈ శ్రీనివాసులు, రామక్రిష్ణ, రాము, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



అదనపు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అధికారులు

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

బడి ఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడి బాట కార్యక్రమం మండలాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామదీపికలు, గ్రామపెద్దలు గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీ తీస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈమేరకు ప్రభుత్వం అందించే సౌకర్యాలను కరపత్రాల పంపిణీ చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి చైతన్యపరిచారు.

– సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: సుబ్లేడులో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



రఘునాథపాలెం: వేపకుంట్లలో బడిబాట ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు



నేలకొండపల్లి: మంగాపురంతండాలో బడిబాటలో పాల్గొన్న ఏసీడీపీఓ కనకదుర్గ